క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

టి.నరసాపురం: మండలంలోని రుద్రకోటరాజుగూడెం ఫీడర్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు నిమిత్తం ఈ నెల 17 నుంచి 21 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక మెట్ట మీద సబ్‌స్టేషన్ పరిధిలో రాజుల కాలనీ లైన్, అగ్రికల్చర్ లైన్ నిర్వహణ, చెట్ల కొమ్మల తెలగింపు నిమిత్తం గురువారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాజుల కాలనీలోని అన్ని రకాల సర్వీసులకు, రామచంద్రాపురం ఏరియాలో వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో 24 గంటల లైన్ ఏర్పాటు నిమిత్తం కట్టవపాదలగూడెం గ్రామానికి వ్యవసాయ, గృహ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

గవరవరం వాసికి పురస్కారం



అవార్డును అందుకుంటున్న వెంకటరమణ

కొయ్యలగూడెం: మండలంలోని గవరవరం గ్రామానికి చెందిన బొమ్మ వెంకటరమణమూర్తి మదర్ థెరీసా సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అందించే సేవ పురస్కార అవార్డు అందుకున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటించారు.. ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో వాసవి సేవా సమితి ఆలయ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఫౌండర్ బొమ్మ రాధిక కళ్యాణితో కలిసి చైర్మన్‌గా సేవలు అందిస్తున్నందుకు హైదరాబాదుకు చెందిన ట్రస్ట్ తమను ఎంపిక చేసిందని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 15 మందిని ఎంపిక చేయగా, ఏలూరు జిల్లా నుంచి తమకు అవార్డు వచ్చిందని పేర్కొన్నారు. వీరంతా పంద్రాగస్టున ప్రధాని మోదీ చేతుల మీదుగా ఢిల్లీలో సత్కారం అందుకోనున్నట్టు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గంగవరం గ్రామంలో ఎన్నారై కుటుంబీకులు బుధవారం పలు విద్యాసంస్థల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. విజ్జు మాధవి సత్యనారాయణ దంపతులు కుమార్తె సరయుతో కలిసి అంగన్‌వాడీ, ఎంపీపీ, ఎయిడెడ్, పాఠశాలలోని విద్యార్థులకు రూ.20 వేల విలువైన సామగ్రిని అందజేశారు. పౌష్టికాహార పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు పోల్నాటి రమేష్, బల్లె కేశవ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

వేట మాంసం మాటున పశు మాంసం విక్రయం



కన్నాపురంలోని మారుమూల ప్రాంతంలో విక్రయిస్తున్న లేగ దూడ మాంసం

కొయ్యలగూడెం: కన్నాపురం సమీపంలోని చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ ప్రాంతంలో ఒక వర్గానికి చెందిన వ్యక్తులు లేగ దూడలను చంపి ఆ మాంసాన్ని వేట మాంసంగా విక్రయిస్తుండగా ఆ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు బుధవారం అడ్డుకున్నారు. ఆ వ్యక్తులను నిలదీశారు. అక్కడే ఉన్న మరో లేగ దూడను రక్షించారు. అయితే పశు మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తులు వేరే ప్రాంతానికి చెందని వారిగా గుర్తించారు. దీనిపై ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేయగా, పశుమాంసం విక్రేతలు అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

పెరిగిన వర్జీనియా ధర

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధర ఒక్కసారిగా పెరిగింది. బుధవారం కేజీ రూ.33 పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం రూ.359 పలకిన వర్జీనియా ధర కేజీ బుధవారం రూ.392కు చేరింది. ఈ ధర ఏలూరు జిల్లాలో ఉన్న జంగారెడ్డిగూడెం-2 వేలం కేంద్రంలో రూ.392, జంగారెడ్డిగూడెం-1, కొయ్యలగూడెం వేలం కేంద్రాల్లో రూ.391 పలికింది. వేలం ప్రారంభ సమయంలో కేజీ ధర రూ.290 పలికింది. ఈ ధర చాలా రోజులు స్థిరంగానే కొనసాగింది.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

లింగపాలెం: ఆశన్నగూడెం, కొణిజర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పీఎంఎఫ్‌బీవై స్కీమ్‌లో వరి పంట వేసిన ప్రతి రైతూ ఎకరానికి రూ.840 కట్టి బీమా చేయించుకోవాలని సూచించారు. పచ్చి రొట్ట పైర్ల వల్ల ఉపయోగాలు, కౌలు రైతులకు కౌలు కార్డుల వల్ల ఉపయోగాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఆశన్నగూడెం కొణిజర్ల రైతులు, వ్యవసాయ, హార్టీకల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వసతి గృహం

- భవనం శ్లాబు నుంచి లీకవుతున్న వర్షం నీరు
- గిరిజన విద్యార్థులకు అవస్థలు



బుట్టాయగూడెం గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం



బుట్టాయగూడెంలో భవన నిర్మాణం చేపట్టాలని ధర్నా చేస్తున్న విద్యార్థులు

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహం శిథిలావస్థకు చేరింది. శ్లాబు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడి వర్షపునీరు లీకవడం, బీటువారిన గోడలు, సరైన సదుపాయంలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ భవనంలో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం చోటుచేసుకుంటుందో అని విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రమైన భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 52 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలో కేఆర్ పురం ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. ఈ గృహంలో ఇంటర్, ఐటీఐ, డిగ్రీ కళాశాల బాలురు వసతి పొందుతున్నారు. కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త భవనానికి ప్రతిపాదనలు

బాలుర వసతిగృహ నూతన భవన నిర్మాణానికి ఐటీడీఏ అధికారులు సుమారు రూ.2.75 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు ఆమోదం కూడా లభించింది. జీఓతోపాటు అవసరమైన అన్ని ప్రక్రియలూ పూర్తయ్యాయి. అయితే అనుమతుల కోసం చూస్తున్నామని అధికారులు చెబుతున్నా, ప్రస్తుతం అవి ఏ స్థాయిలో ఉన్నాయో అర్థంకావడంలేదని విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి తరగతులు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకూ ఆ భవనానికి కనీస మరమ్మతులు కూడా చేపట్టిన దాఖలాలు లేవు. ఇటీవల అడపాదడపా వర్షాలు మాత్రమే కురిశాయి. విస్తారంగా వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. సిమెంట్ పెచ్చులు ఊడి శ్లాబు ఊసలు బయటకు కనిపిస్తుండడంతో వారు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గుమ్మాలు, కిటికీలు కూడా పూర్తిగా పాడైపోయాయి. మరుగుదొడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు పాత భవనం తొలగించి నూతన భవనం నిర్మాణానికి కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. భవన నిర్మాణానికి కృషి చేయాలని విద్యార్థులు ర్యాలీలు చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



బుట్టాయగూడెం గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలమైంది. ఈ భవనంలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. కనీసం తలుపులు, కిటికీలు కూడా లేవు. అధికారులు స్పందించి కొత్త భవన నిర్మాణానికి కృషి చేయాలి. లేకుంటే భవన నిర్మాణం ప్రారంభించే వరకూ ఆందోళన చేస్తాం.

– బన్నే వినోద్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు, బుట్టాయగూడెం

స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించాలి

కుక్కునూరు: స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వివిధ పార్టీల ఆధ్వర్యంలో కుక్కునూరులో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే నాలుగుసార్లు విద్యుత్ చార్జీలను పెంచడంతో పాటు స్మార్ట్ మీటర్లను గృహాలకు బిగించి ప్రజల నడ్డి విరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రూఅప్, ఇందనపు సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలతో ప్రజలపై మోపిన భారాన్ని తగ్గించాలన్నారు. సీపీఐ నాయకులు కురాకుల బాబురావు, వర్సా పాపారవు, నాగరాజు, సీపీఎం నాయకులు వై నాగేంద్రరావు, పొట్ల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయి సత్యనారాయణ, మల్లెల చంటినాయుడు, పగిళ్ల అల్లేష్, కాంగ్రెస్ నాయకులు వడ్డే రఘు, వర్సా నాగేశ్వరావు, మడకం వీరయ్య, సీపీఐ ఎం ఎల్ ప్రజాపంథా నాయకులు పెంకె వీర బాబు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఒక ప్రముఖుని ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సాలిపేటలో డీకేడీ సత్యనారాయణ ఇంట్లో డీకేడీ సత్యనారాయణ, వీఎస్ జగదీష్‌కుమార్, చీకిటి రామారావు, ఎం.చంద్రశేఖర్, బిక్కిన వెంకటేశ్వరరావు, కొల్లూరి రాంబాబు, దాసరి రామచంద్రరావు, నాయుడు వెంకటేశ్వరరావు, మట్టా అజయ్ కుమార్‌లను అరెస్టు చేశారు. వీరిపై గేమింగ్ యాక్ట్ కేసు నమోదు చేశారు. బెయిల్ ఇచ్చి విడుదల చేశారు. రూ.2.70 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు



కొయ్యలగూడెం సంత మార్కెట్లో ఉన్న కూరగాయలు

కొయ్యలగూడెం: సీజన్‌కి విరుద్ధంగా కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. బుధవారం కొయ్యలగూడెంలో నిర్వహించిన సంత మార్కెట్లో కూరగాయల ధరలను చూసిన ప్రజలు విస్తుపోయారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కూరగాయల ధరల పెరిగాయని రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు కురవడం వల్ల కూరగాయలు అందుబాటులో ఉంటాయి. వేసవికాలంలో ఉండే ధరలు తగ్గుముఖం పడతాయి. కానీ ఈదఫా ధరలు తగ్గకపోగా పెరగడానికి వర్షాలు కురవకపోవడం కారణమయ్యాయి. ఉల్లి, మిర్చి ధరలు పెరిగాయి. మిర్చి ధర కేజీ రూ.100కు చేరడం వినియోగదారుల కళ్లల్లో ఘాటు తెప్పిస్తోంది. చిక్కుడు 70, బెండకాయ 45, ఉల్లి 30 నుంచి 35, ఇలా ప్రతి కూరగాయ ధరలు రూ.10 నుంచి 15 రూపాయలు పెరిగాయి. వారపు సంతలో కూరగాయల అధిక ధరల వల్ల కొనడానికి ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఆషాఢం, శ్రావణమాసాల్లో శాకాహారం తీసుకునే ప్రజలు ఎక్కువగా ఉంటుంటారు. వర్షాభావ పరిస్థితులు ఇదేవిధంగా కొనసాగితే అన్ని కూరగాయల ధరలు కేజీ రూ.100కు చేరువవుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

కేసుల రాజీతో సమయం, డబ్బు ఆదా



జంగారెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయసేవాధికార సంస్థ సభ్యులు



చింతలపూడి : మధ్యవర్తిత్వంపై బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కోర్టు కేసుల విషయంలో కక్షిదారులు రాజీ పడితే సమయం, డబ్బును ఆదా చేసుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ కోర్టులో పెండింగ్ కేసుల మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కేసుల రాజీకి ప్రత్యేక న్యాయవాదులు నియమించామని, వారి సేవలను వినియోగించుకోవాలని కక్షిదారులను కోరారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు మోడేపల్లి నాగులు, మీడియేషన్ ట్రైనింగ్ న్యాయవాదులు అచ్యుత శ్రీనివాసరావు, మాదేపల్లి క్రాంతి కుమార్, డీఆర్‌పీ కృష్ణ, న్యాయవాదులు ఏవీవీ భువనేశ్వరి, బి.లతా కుమారి, పి.ప్రతాప్, ఐ.శ్రీనివాసరావు, మాంద్రు మోహన్‌రావు, మాంద్రు వరప్రసాదరావు, రాజీవ్ కుమారి, బల్లే సాయి కుమారి, బిందు, అడ్వకేట్ గుమస్తాలు, పిఎల్వీలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై ర్యాలీ

చింతలపూడి: న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలో మధ్యవర్తిత్వంపై అవగాహన 1 కే బైక్ ర్యాలీ స్థానిక జిబిజి రోడ్డు నుంచి కోర్టు కాంప్లెక్స్ వరకు నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ మధు బాబు అధ్యక్షతన మధ్యవర్తి న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, కక్షిదారులకు అవగాహన కల్పించారు. ఎస్సై కె.సతీష్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతి ముస్లిమూ విద్యావంతుడు కావాలి



తాడువాయి లో సమావేశమైన ముస్లిం పెద్దలు

జంగారెడ్డిగూడెం: ప్రతి ముస్లిమూ విద్యావంతుడు కావాలని ముస్లిం స్థానిక జేఏసీ సభ్యులు అన్నారు. తాడువాయి మసీదులో తాడువాయి, జీలుగుమిల్లి, దర్భగూడెం, అప్పలరాజుగూడెం, వేగవరం సమీదు పెద్దలతో బుధవారం జేఏసీ సభ్యులు సమావేశం నిర్వహించారు. విద్య విషయంలో ముస్లింలు విద్య లేకపోవడం వల్లే రాజకీయంగా, ఆర్థికంగా, ఉద్యోగ పరంగా పురోగతి సాధించలేకపోతున్నారని, ధార్మిక విషయాల్లో కూడా సరైన అవగాహన లేక వెనకబడి ఉంటున్నారని జేఏసీ సభ్యులు తెలిపారు. ముస్లిం పిల్లలను కనీసం డిగ్రీ వరకు చదివించాలని, దీనికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు. జేఏసీ సభ్యులు షేక్ ముస్తఫా, మొహమ్మద్ నబీ, షేక్ నజీర్ బాషా తదితరులు మాట్లాడారు. షేక్ ముస్తఫా, షేక్ బాజీ (టిప్ టాప్), షేక్ యాకూబ్, షేక్ నజీర్ బాషా, షేక్ ఆదిల్, షేక్ ముస్తాక్, మహమ్మద్ నబీ (టీచర్), అబ్దుల్ షాహిన్, అస్మత్ అలీ, అస్మల్ బెగ్, ఇస్మాయిల్, మీరావలి, మస్తాన్, ఇస్మాయిల్, మొహిద్దిన్, ఖాసిం, షఫీ, రషీద్, ఫాజిల్, పీరు తదితరులు పాల్గొన్నారు.

పంచవింసతికి చేరిన పారాయణ

కొయ్యలగూడెం: గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీలలితా సహస్రనామ కోటి పారాయణ పంచవింసతిలక్ష (25 లక్షలు)కి చేరిందని పురోహితులు అని పెద్దినరసింహ శర్మ మూర్తి బుధవారం పేర్కొన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ప్రారంభమైన పారాయణ కార్యక్రమంలో నిత్యం 80 మంది వరకు మహిళలు పాల్గొంటున్నట్టు తెలిపారు.

అయ్యప్పకు పూజలు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులో విజిలెన్స్ తనిఖీ



కామవరపుకోట ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కామవరపుకోట: కామవరపుకోటలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో మంగళవారం రాత్రి వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు బొడ్డపాటి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ సీఐ జి.మధుబాబు, ప్రత్యేక తనిఖీ బృందం తనిఖీ చేశాయి. స్థానిక బచ్చు కృష్ణమూర్తి ఎరువుల షాపులో వివిధ దస్త్రాలు, స్టాకు రిజిస్టర్లు, కొనుగోలు ఇన్వాయిసులను పరిశీలించారు. ఫారం-ఓలో నమోదుకాని ఎరువులు, గోదాములో సక్రమముగా నిల్వ చేయని ఎరువుల స్టాకు 94.850 మెట్రిక్ టన్నులను గుర్తించామని, దీని విలువ రూ.17,14,784, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లులేని పురుగు మందులు 65.500 లీటర్లు గుర్తించామని, దీని విలువ రూ.51,959లని తెలిపారు. డీలర్లంతా నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాలన్నారు. లేకుంటే శిక్షార్హులని హెచ్చరించారు. ప్రతి రైతూ ఎరువులు, పురుగుమందులు కొనుగోలు సమయంలో బిల్లు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఈ తనిఖీల్లో చింతలపూడి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు యండ్రపాటి సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో జాగ్రత్తలు పాటించాలి



పోలవరం రూరల్ : సర్టిఫికెట్లు అందుకున్న బీఎల్‌ఓలు



కొయ్యలగూడెం : బూత్‌ల పరిశీలిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: కొత్త ఓటర్ల నమోదు విషయంలో బీఎల్‌ఓలు జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ తహసీల్దార్ కేయూ శ్రీనివాస్, ఎపిక్ ఎస్ జయశ్రీలు తెలిపారు. పోలవరంలో బుధవారం బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. టి.నరసాపురం జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ ట్రైనీగా వ్యవహరించారు. బీఎల్‌ఓలకు పరీక్ష నిర్వహించి, ట్రైనింగ్ సర్టిఫికెట్ అందజేశారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కొయ్యలగూడెం: పెరిగిన ఓటర్ల సంఖ్య నేపథ్యంలో మండల వ్యాప్తంగా పోలింగ్ బూత్‌ల సంఖ్య పెంచుతున్నట్టు తహసీల్దార్ ఎం నాగరాజు పేర్కొన్నారు. బుధవారం పరింపూడి పంచాయతీ పరిధిలో ఉన్న పలు ఎలక్షన్ బూత్‌లను రెవెన్యూ, విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు కొయ్యలగూడెంలో 10 పోలింగ్ బూత్‌లు ఉండగా వాటి సంఖ్య 14కు, మండల వ్యాప్తంగా ఉన్న 64 బూత్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

పోలింగ్ స్టేషన్ల మార్పుపై సమావేశం

కుక్కునూరు: పోలింగ్‌స్టేషన్‌ల మార్పుపై బుధవారం తహసీల్దార్ రమేష్‌బాబు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పీఎస్–6 (ఇబ్రహీంపేట), పీఎస్–13(దామరచర్ల), పీఎస్–16 (వింజరం) పీఎస్–17 (కొండపల్లి), పీఎస్–23 (రామసింగారం) పోలింగ్ స్టేషన్లలో రేషనలైజేషన్ గురించి, ఓటర్ల సంఖ్య 1250 దాటిన నేపథ్యంలో పోలింగ్ స్టేషన్‌లో మార్పులపై చర్చించారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి



చెత్త సేకరణపై సూచనలిస్తున్న డీఎల్‌డీఓ

బుట్టాయగూడెం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డీఎల్‌డీఓ ఎం రాజు సూచించారు. బుట్టాయగూడెంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయడంతోపాటు వాటిని రైతులు విక్రయించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బుట్టాయగూడెంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవప్రియుడు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల నియామకం కోరుతూ దీక్ష



దీక్ష చేస్తున్న విద్యార్థి సంఘాలు, పార్టీల నాయకులు

కుక్కునూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ కోరుతూ విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ, సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్, కాంగ్రెస్, సీఐటీయూ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన సెంటర్‌లో బుధవారం రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు లెనిన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి 34 రోజులు గడిచాయని మరికొన్ని రోజుల్లో ఎఫ్ఏ 1 పరీక్షలు కూడా నిర్వహించనున్నా విద్యార్థులకు ఇంతవరకు సిలబస్ ప్రారంభం కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బదిలీ చేస్తుంటే కుక్కునూరు ఎంఈఓ బాబురావు అనాలోచితంగా వ్యవహరించారని విమర్శించారు. టీచర్‌ల బదిలీలో ఉన్న ఉత్సాహం ఖాళీ స్థానాలను భర్తీ చేయడంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. మండలంలోని ఖాళీగా ఉన్న 95 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, బడి బస్సు ఏర్పాటు చేయాలని, వంటషెడ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో విద్యార్థులు, సీపీఎం, సీపీఐ నాయకులు యర్రంశెట్టి నాగేంద్రరావు, కొన్నె లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లేల చంటినాయుడు, కాంగ్రెస్ నాయకులు వడ్డే రఘు, గజ్జి రాజులు, వర్సా నాగేశ్వరావు, మడకం వీరయ్య,గిరిజన సంఘం నాయకులు పట్ల లక్ష్మయ్య, సీఐటీయూ నాయుడు యర్నం సాయికిరణ్ పాల్గొన్నారు.

శ్రీవారి గోవులకు టీకాలు



శ్రీవారి గోసంరక్షణశాలలో లంపి స్కిన్ వ్యాధితో బాధపడుతున్న లేగ దూడ



ఆవులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం గో సంరక్షణ శాలలో 310 ఆవులు, దూడలకు పశు వైద్యాధికారులు బుధవారం లంపి స్కిన్ (ముద్ద చర్మపు వ్యాధి) నివారణ టీకాలు వేశారు. భీమడోలు ఏడీ డాక్టర్ రవిచంద్, మండల పశు వైద్యాధికారి అంగర సురేష్‌లు గోవులను పరిశీలించారు. ఈ నెల 31 వరకు పశువులకు ఈ లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందని ఏడీ తెలిపారు. రైతు సేవా కేంద్రం, లేదా స్థానిక పశు వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. నాలుగు నెలల వయస్సు పైబడిన ఆవు దూడలకు, ఆవులకు ఈ టీకాలు వేయించాలన్నారు. వ్యాధి సోకిన సకాలంలో టీకాలు వేయించకుంటే దూడలు చనిపోయే ప్రమాదం ఉందని, రైతులు ముందుగా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో గోశాల సిబ్బంది, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలు : ఈ వ్యాధి సోకిన ఆవుల శరీరం అంతా బొబ్బలు వస్తాయి

- 104 నుంచి 106 డిగ్రీల జ్వరం ఉంటుంది
- మేత తినకుండా నీరసపడిపోతాయి
- పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది
- ఏడాదిలోపు వయస్సు ఉన్న దూడలకు గంగడోలు వద్ద నీరు చేరి, ఊపిరితిత్తులలో నిమ్ము ఏర్పడటం వల్ల శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

చింతలపూడి : సమస్యల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను అంగీకరించాలని కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. జీఓ 36 ప్రకారం తమకు రావాల్సిన రూ.21,000 జీతం ఇవ్వకుండా రూ.15,000 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. 2021 జనవరిలో నగర పంచాయతీ అయిన నాటి నుంచి పెరిగిన జీతాల ప్రకారం ఒక్కొక్కరికీ రూ.2 లక్షలపైనే జీతాల ఎరియర్స్ బకాయి ఉందని, ఉద్యోగ విరమణ వయస్సు పూర్తయిందన్న పేరుతో కార్మికులకు రావాల్సిన జీతాల ఏరియర్స్ కూడా ఇవ్వకుండా ఉత్తచేతులతో ఇంటికి పంపిస్తున్నారని ఆరోపించారు. క్యాజువల్ లీవులు, జాతీయ పండుగ సెలవులు తమకు ఇవ్వటం లేదని, అధిక గంటలు పని చేయిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేయటానికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్వతి, పద్మ, కమల కుమారి, వెంకటమ్మ, నాగమణి, బాలు, వంశి తదితర నాయకులు పాల్గొన్నారు.